క్లుప్తంగా

బంజారాల దశాబ్ద కల సాకారం

కామేపల్లి: బంజార జాతి మార్గ దర్శకుడు ఆరాధ్యదైవం శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో బంజారాల దశాబ్ద కల సాకారమైందని కామేపల్లి మండల సేవాలాల్ సేన కార్యనిర్వాహక అధ్యక్షుడు సపావట్ కిషన్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. బంజారాల తరపున సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాక్సినేషన్..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో పెంపుడు కుక్కలకు పశువైద్య సిబ్బంది శనివారం యాంటి ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 68 పెంపుడు కుక్కలకు పిచ్చికుక్క కాటు వ్యాధి నివారణ మందును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అనూష, అసిస్టెంట్ డాక్టర్ అజ్మీర సురేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి..

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సభ్యురాలు, 5వ వార్డు మాజీ సభ్యురాలు లేళ్ల సుశీల సంస్మరణ సభను శనివారం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పాల్గొని నివాళులర్పించి ఆమె పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, మంగతాయి, ఝాన్సీ, రామయ్య, లక్ష్మణ్, నర్సింహారావు, లేళ్ల రాంబాబు, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కామేపల్లి: మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభల విజయవంతం కోరుతూ కొత్తలింగాల గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ శనివారం ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండల సహాయ కార్యదర్శి తేలు రాకేశ్, నాయకులు గుగులోత్ తేజ, చల్లా రాజు, పగిడిపల్లి సరవయ్య, వీరయ్య, నగేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ కోసం విమానంలో సర్వే..

నేలకొండపల్లి: పాపటపల్లి–జాన్‌పాడు రైల్వే లైన్ కోసం విమానంలో సర్వే నిర్వహించారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల నుంచి నేలకొండపల్లి మండలం మీదుగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలం వరకు సర్వే నిర్వహించినట్లు సమాచారం. తాజాగా ఈ రైల్వేలైన్ రద్దు చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన నేపథ్యాన విమానం సర్వే చర్చనీయాంశంగా మారింది.

రక్తదాన శిబిరం

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 57వ డివిజన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎండీ ముస్తఫా పుట్టినరోజు సందర్భంగా తలసేమియా చిన్నారులకు కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అదేవిధంగా కంటి వైద్య పరీక్షలు, సెయింట్ మేరిస్ విద్యార్థులకు ఉచితంగా దంతపరీక్షలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రఫీదాబేగం, స్రవంత్, దేవకీ స్టాలిన్, ప్రసాద్, శ్రీను, సుభాన్, మౌలాలి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

16న సాయి మందిరం వార్షికోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న వరప్రదాత షిరిడీ సాయి మందిరం 13వ వార్షికోత్సవాన్ని ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు మందిర చైర్మన్ వేములపలి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ గడ్డపై పుట్టి భారత ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన బహుభాషా కోవిదుడు, తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మహాత్మా గాంధీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఏపీలో జన్మించి తెలుగు చలనచిత్ర రంగం, ఆ తర్వాత రాజకీయంలో రాణించిన మహానేత నందమూరి తారక రామారావుకూ భారతరత్న ఇవ్వాలని కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ట్రూ లవర్
వినోద	అంబాజీ పేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	యాత్ర 2
ఆదిత్య	లాల్ సలామ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఉపాధికి ఊతం.. సమాజ హితం

పర్యావరణ పరిరక్షణకు ఆకు విస్తర్ల తయారీ

- అడ్డాకు, వక్కాకులతో చేస్తున్న వైనం
- ప్లాస్టిక్ నిర్మూలనకు దోహదం
- ఆర్డర్లపై జ్యూట్ బ్యాగుల పంపిణీ
- పలువురికి ఉపాధి కల్పిస్తున్న మహిళ



అడ్డాకులతో తయారు చేసిన విస్తర్లతో సైదా

ఖమ్మంగాంధీచౌక్: ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన వనరులను వినియోగిస్తూ తనదైన శైలిలో తాను ఉపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధినిస్తుంది. ఖమ్మం నగరానికి చెందిన మన్నెం సైదా చదవింది 10వ తరగతి అయినప్పటికీ లక్ష్యం మాత్రం ఉన్నతంగా ఉంది. పర్యావరణానికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా తొలుత జ్యూట్ బ్యాగులను తయారు చేసి విక్రయించడం మొదలుపెట్టింది. కొంతమేరకు మంచి ఫలితాన్ని ఇవ్వడంతో మరో అడుగు ముందుకేసి ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో వివిధ రకాల ఆకులతో ఆహార ప్లేట్ల తయారీకి శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ నిర్మూలనకు పలు సంస్థలు విస్తృ త ప్రచారం చేస్తుండడంతో ప్రజల్లో కూడా అవగాహన పెరిగింది.

ఐదేళ్ల క్రితం శిక్షణ పొంది..

సైదా ఐదేళ్ల క్రితం జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ పొంది నగరంలోని బోస్ బొమ్మ సెంటర్‌లో శ్రీ కృష్ణసాయి జ్యూట్ బ్యాగ్స్ పేరిట సంస్థను నెలకొల్పారు. పర్సులు మొదలు పిల్లల, పెద్దల లంచ్ బాక్స్ బ్యాగులు, లగేజీ, మహిళలకు హ్యాండ్ బ్యాగులు, చేతి సంచులు వంటివి తయారు చేస్తూ.. మార్కెట్‌లోని వస్త్ర దుకాణాలు, గోల్డ్ షాపులు, కిరాణ దుకాణాలకు ఈ బ్యాగుల వినియోగాన్ని విస్తరించారు. దీంతో వ్యాపారులు కూడా పర్యావరణ హితంలో భాగంగా ముందుకొచ్చి వస్తువులను జ్యూట్ బ్యాగుల్లో ఇస్తున్నారు. అంతేకాక వివాహాది శుభకార్యాల్లో గిఫ్ట్‌లను ఇచ్చేందుకు కూడా అనువైన బ్యాగులను తయారు చేసి విక్రయిస్తున్నారు.

గతంలో మోదుగాకుతో తయారీ..

రెండు దశాబ్దాల క్రితం మన ప్రాంతంలో మోదుగా కుతో విస్తర్లను తయారు చేసి వివాహాది శుభ కార్యాలకు, ఇతర కార్యక్రమాలకు వినియోగించే వారు. కా లక్రమేణ ప్లాస్టిక్ వినియోగం పెరగటం, ఆ ఆకుల ను అడువుల నుంచి తేవటం, కుట్టడం పెద్ద పనిగా ఉండేది. దీంతో అందుబాటులోకి ప్లాస్టిక్ ప్లేట్లు రావడంతో ప్రజలు ఆ ప్లేట్లకు అలవాటు పడ్డారు. ప్లాస్టిక్ నిర్మూలన అంశం విస్తృతంగా ప్రచారం కావడంతో ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంతో తిరిగి పూర్వం వినియోగించిన ఆకుల విస్తర్లకు గుర్తింపు వచ్చింది. అరటి తోటలు ఉన్న ప్రాంతాల్లో నేరుగా ఆ ఆకులను విని యోగిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అడ్డాకును వినియోగించి విస్తర్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇక ఇటీవల కాలంలో వక్కాకుతో కూడా విస్తర్లను తయారు చేస్తున్నారు. సైదా ఆయా ఆకులను తెప్పించి ఖమ్మంలో ప్లేట్లను తయారు చేస్తున్నారు.

ఉపాధి పొందుతూ.. పలువురికి శిక్షణ, ఉపాధి

జ్యూట్ బ్యాగులు, ఆకుల విస్తర్ల తయారీతో సైదా ఉపాధి పొందడంతో పాటు ఆసక్తి కలిగిన మహిళలకు శిక్షణనివ్వడం, మరికొందరికి తన వద్దనే ఉపాధిని కల్పించడం చేస్తున్నారు. తన వద్ద శిక్షణ పొందిన కొందరు ఇతర ప్రాంతాల్లో జ్యూట్ బ్యాగులను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరు తయారు చేసిన వాటిని ఆర్డర్లపై వివాహాది శుభకార్యాలకు, అమెరికా వంటి ఇతర దేశాలకు పంపుతున్నారు.



వివిధ రకాల వక్కాకు ప్లేట్లు





జ్యూట్ బ్యాగులను తయారు చేస్తున్న సైదా, తదితరులు (ఇన్‌సెట్) భిన్నమైన బ్యాగులు

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

అడ్డాకును విశాఖపట్నం పాడేరు ప్రాంతం నుంచి టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. అక్కడ మహిళలు ఆకును కడిగి ఆరబెట్టి విస్తర్లు కుట్టి ఇస్తారు. కాని ఇక్కడ ఆ ఆకు కింద పేపర్ వేసి ప్లేటు మాదిరిగా యంత్రంలో తయారు చేస్తున్నారు.

సమాజ హితం కోసమే..

ప్లాస్టిక్ నిర్మూలనలో నా వంతు పాత్ర చూపాలని జ్యూట్ బ్యాగుల తయారీని ముందుగా ఎంచుకున్నా. తర్వాత ఆకులతో విస్తర్లను తయారు చేయగా.. ప్రయత్నం ఫలించింది. ఆదాయం కోసం గాకుండా నలుగురికి ఉపయోగపడేలా పనిచేస్తూ, కొందరికి ఉపాధి కల్పించాలని జ్యూట్ బ్యాగులు, ఆకులతో విస్తర్లను తయారు చేస్తున్నాం.

– మన్నెం సైదా, శ్రీ కృష్ణసాయి జ్యూట్ బ్యాగ్స్, బోస్‌బొమ్మ సెంటర్, ఖమ్మం

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి..



ప్రతీ కార్యక్రమంలో ప్లాస్టిక్ రహిత వస్తువుల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇంటిలో శుభకార్యాలు, దేవాలయంలో ప్రసాదాల పంపిణీకి, అన్నదానం వంటి కార్యక్రమాలకు ఆకులతో తయారు చేసిన ప్లేట్లను మాత్రమే వినియోగిస్తుంటాం. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అంతా కృషి చేయాలి.

– మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవాలయ చైర్మన్, ఖమ్మం

విస్తర్లు, రవాణా, పేపరు, తయారీ మొత్తం రూ. 5ల వరకు ఖర్చవుతుండగా, ఒక్కో ప్లేటును ఆర్డర్లను బట్టి రూ. 6ల వరకు విక్రయిస్తున్నారు. ఇక వక్కాకును కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ ఆకు కేవలం జూలై నుంచి ఆగస్టులలో మాత్రమే లభ్యమవుతుండడంతో ఆ సమయాన ఆర్డర్ల ద్వారా దిగుమతి చేసుకొని నిల్వ పెట్టుకొని ప్లేట్లను తయారు చేస్తున్నారు. ఈ ఆకును 6 గంటలు నీళ్లలో నానబెట్టి తుడిచి, ఆరబెట్టి తగిన వేడిలో యంత్రంలో ప్లేట్లను తయారు చేస్తున్నారు. ఈ ప్లేట్ల తయారీకి రూ.7ల వరకు పడుతుండగా, రూ.8ల చొప్పున విక్రయిస్తున్నారు. ఇక సైజును బట్టి టిఫిన్ ప్లేట్లు రూ.6లు, స్నాక్స్, పండ్ల ప్లేట్లు రూ.3ల చొప్పున, ప్రసాదాల బౌల్స్ రూ.2ల చొప్పున విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ ప్లేట్లకు ఆకుల ప్లేట్లకు 50 పైసల నుంచి ఒక రూపాయి వరకు తేడా ఉంటుంది. ఈ వ్యత్యాసాన్ని గుర్తించే వారు ఆకుల ప్లేట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

బడ్జెట్‌పై ఎవరేం అన్నారంటే..

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రప్రభుత్వం శనివారం శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

- **ఆవుల అశోక్, ప్రజాపంథా నాయకుడు :** బడ్జెట్ సాదాసీదాగా ఉంది. ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయించడం మినహా ఇతర రంగాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు.
- **పోటు ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి :** ఉమ్మడి జిల్లాకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సీతారామ ప్రాజెక్టుకు సరిపడా నిధులతో పాటు పాలేరు, వైరా, లంకాసాగర్, జాలిముడి ప్రాజెక్టుల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి.
- **టి.ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి :** బడ్జెట్‌లో విద్యారంగానికి 7.8 శాతం మాత్రమే నిధులు కేటాయించడం సరికాదు. ఎన్నికలకు ముందు పాఠశాలలకు భవనాల నిర్మాణం, ఖాళీల భర్తీ, యూనివర్సిటీల అభివృద్ధి, జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటుపై హామీ ఇచ్చినా ఆ ఊసే ఎత్తలేదు.
- **మస్తాన్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి :** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన హామీని విస్మరించింది. ఇప్పటికే విద్యారంగం నిధుల లేమితో తల్లడిల్లుతుండగా సరైన కేటాయింపులు లేకపోవడంతో సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి కనపించడం లేదు.
- **మేకల మల్లిబాబు, డీసీసీబీ డైరెక్టర్ :** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. ఆరు గ్యారంటీల అమలుకు రూ.53,196 కోట్లు కేటాయించడం హర్షణీయం.
- **యర్రా శ్రీకాంత్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు :** బడ్జెట్‌లో సమగ్రత లోపించింది. చూసేందుకు బారీగా ఉన్నా ఏ రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవు. కేవలం ఆరు గ్యారంటీల అమలుకే కేటాయింపులు చేసినట్టు ఉంది.
- **బచ్చలకూరి నాగరాజు, కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడు :** బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఉపయోగపడేలా బడ్జెట్ ఉంది. పేదలకు ఉపయోగపడేలా బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు.
- **డాక్టర్ మద్ది శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి :** బడ్జెట్ ముమ్మాటికీ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే రీతిలో ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే సరిదిద్దేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ హరికృష్ణ

ఖమ్మంక్రైం: నేరాల నియంత్రణ, నిందితులను గుర్తింపు కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నగర ఏసీపీ హరికృష్ణ తెలిపారు. పోలీస్, ఆర్టీసీ అధికారుల సమన్వయంతో ఖమ్మం పాత బస్టాండ్ పరిసరాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేరాలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్, ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, ఆర్టీసీ సీఐ రామిశెట్టి రామయ్య, స్టేషన్ మేనేజర్ రాయప్ప, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు పర్స్ అప్పగింత



డ్రైవర్‌కు పర్స్ అందజేస్తున్న హోంగార్డు రవి

ఖమ్మంక్రైం: మూడు రోజుల క్రితం ఒక ఆటోడ్రైవర్ పోగొట్టుకున్న పర్స్‌ను అందులోని రశీదుల ఆధారంగా ఆచూకీ గుర్తించిన హోంగార్డ్ అప్పగించాడు. ఖమ్మంలోని పాత ఎల్ఐసీ కార్యాలయం వద్ద హోంగార్డు రవి విధులు నిర్వర్తిస్తుండగా ఆయనకు రోడ్డుపై పర్స్ లభించింది. అందులో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులతో పాటు ప్రైవేట్ పాఠశాలలో ఫీజు చెల్లించిన రశీదు ఉన్నాయి. ఈమేరకు ఆరా తీసి ఆటోడ్రైవర్ పత్తి వెంకటేశ్వర్లుదిగా గుర్తించి శనివారం అందజేయగా.. సహచర సిబ్బంది అభినందించారు.

గ్రూప్-4 ఫలితాల్లో అన్నదమ్ములు ఎంపిక



గంగారపు సాయికృష్ణమ నాయుడు, రత్నేశ్వర నాయుడు

కామేపల్లి: టీఎస్‌పీఎస్‌సీ విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో గోవింద్రాల బంజరకు చెందిన గంగారపు సత్యనారాయణ–జ్యోతి దంపతుల చిన్న కుమారుడు రత్నేశ్వర నాయుడు 5వ ర్యాంకు (200 మార్కులు), పెద్ద కుమారుడు సాయికృష్ణమనాయుడు 35వ ర్యాంకు (188 మార్కులు) సాధించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

15న సెమినార్

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16వ తేదీల్లో నేషనల్ స్థాయిలో సెమినార్ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి శనివారం తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథ్స్ వారి ఆధ్వర్యాన అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమేటిక్స్ అనే శీర్శికన సెమినార్ జరుగుతుందని , ఆసక్తి గలవారు సకాలంలో పాల్గొనాలన్నారు.

గోటి తలంబ్రాల తంతు..



గోటి తలంబ్రాలను వలుస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి బాలాజీ సేవా సమితి ఆధ్వర్యాన గోటి తలంబ్రాల పుణ్యక్రతువుతంతును శనివారం నగరంలోని కమాన్‌బజార్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రారంభించారు. చింతకాని మండలం జగన్నాథపురం, కొండకొడిమ గ్రామాల్లో పండించిన 1.25 క్వింటళ్ల వరి ధాన్యాన్ని సేకరించి సమితి వ్యవస్థాపకురాలు వడ్డే లక్ష్మి ఆధ్వర్యాన గోటి తలంబ్రాలుగా వలుస్తున్నారు. తొలుత ఆలయంలో పూజలు నిర్వహించాక కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రదర్శనలతో ఆత్మవిశ్వాసం మెరుగు



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న డీఈఓ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ప్రతీ విద్యార్థి అంతర్గత ప్రతిభా పాటవాలు, ఆలోచనలను పెంపొందించుకొని ప్రదర్శనలు తయారు చేయగలననే ఆత్మవిశ్వాసం మెరుగుపరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ అన్నారు. శనివారం నగరంలోని షైన్ ఇండియా స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని తిలకించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక కార్పొరేటు విద్యావిధానంలో షైన్ ఇండియా స్కూల్ సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తాళ్లూరి సృజన్‌కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తాళ్లూరి ఉషారాణి, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు గుర్రం కాంతారావు, స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలి

ఖమ్మం అర్బన్: రేషన్ కార్డులోని ప్రతీ లబ్ధిదారుడు వారం రోజుల్లోనే ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి సూచించారు. శనివారం తన చాంబర్‌లో ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని 78శాతం పూర్తయిందని, రేషన్ దుకాణానికి రాలేని వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఈ–కేవైసీ చేపించాలన్నారు. డీలర్లుగా ఉండి అనేక ఏళ్లుగా రేషన్ దుకాణాలు నడపని వారికి నోటీసులు జారీ చేయాలని డీటీ సురేష్‌బాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నగర అధ్యక్షుడు ఇబ్రహీం, జిల్లా ప్రధాన కార్యదర్శి జానివియా, సంతోష్, ఖాజామియా, జానీ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో నూతనోత్సాహం..



బహుమతులు అందుకున్న విద్యార్థులతో శ్రీరామ్

ఖమ్మం సహకారనగర్: క్రీడా సంబరాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపి నిత్యం చురుకుగా ఉంచుతాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ అన్నారు. శనివారం స్థానిక స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల ఆవరణలో క్రీడా సంబరాల బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొని బహుమతులు అందించి మాట్లాడారు. విద్యార్థులను క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కామేపల్లి: పండితాపురంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్/కూసుమంచి/కామేపల్లి:రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దయాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదానం, పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు తోట చినవెంకటరెడ్డి, తోట శ్రీనివాసరెడ్డి, మేకల మల్లిబాబు యాదవ్, మేకపోతుల మహేశ్ గౌడ్, జ్యోతిర్మయి, నర్సింహానాయక్, నాగిరెడ్డి, హరిబాబు, మహేశ్ బాబు, హరిశ్చందర్, ఉపేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఖమ్మం లైయన్స్ క్లబ్ ఆధ్వర్యాన పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకు 40 రోజుల పాటు అల్పాహారం అందించనున్నట్లు లైయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆధ్వర్యాన లైయన్స్ క్లబ్ సభ్యులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో లైయన్స్ క్లబ్ సభ్యులు సుధాకర్, దామోదర్ రెడ్డి, సుంకు నాగిరెడ్డి, హెచ్ఎం నాగేశ్వరరావు, గుడిపూడి శ్రీనివాసరావు, కుమారస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కూసుమంచి/ఖమ్మంరూరల్: ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపంగు మల్లేశం, ఐఎన్‌టీయూసీ కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల అధ్యక్షులు తంగెళ్ల చంద్రయ్య,ల ఎం.వెంకటరెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడులో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండీ హఫీజుద్దీన్‌తో పాటు కార్మిక సంఘాల నాయకులు పులిపాటి వెంకన్న, ఎండీ పాషా, వెంకటనారాయణ, మైసయ్య, సాగర్, వెంకటేశ్, లింగా, మద్ది వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, కె.మధు, ఎం.భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

వాసవీభవన్ ఎన్నికలకు నామినేషన్లు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వాసవీభవన్ కమిటీని ఎన్నుకునేందుకు నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఈసందర్భంగా అధ్యక్ష పదవికి గాను శనివారం గెల్లా శ్రీనివాసరావు, పసుమర్తి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. సంఘంలో 209 మంది సభ్యులు ఉండగా ఏకగ్రీవానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఈనెల 25న ఎన్నిక నిర్వహించనున్నారు.

సెల్ పాయింట్ వద్ద ఘర్షణ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం మండల కేంద్రంలో సెల్ రిపేర్ కోసంవచ్చాడు. రిపేర్ అనంతరం రూ.4 వేలు చెల్లించాలని షాపు యాజమాని చెప్పగా.. ఇరువురి మధ్య మాటామాట పెరిగి వివాదం తారాస్థాయికి చేరింది. చివరకు ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు.